

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,09,051లు బంగారం 3 గ్రాములు, వెండి 33 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



శాసన సభలో రాసాభాస..!

రాష్ట్ర శాసనసభలో సోమవారం గందరగోళ వాతావరణం నెలకొంది.

- 8లో



రత్న భాండాగారం కమిటీ సమావేశం

పూరీ శ్రీమందిరం రత్న భాండాగారం పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం జరిగింది.

- 8లో

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు రైళ్లు రద్దు
- మరికొన్ని సమయాల్లో మార్పు



ఘటనా స్థలంలో పునరుద్ధరణ కార్యకలాపాలు



పట్టాలు తప్పిన గూడ్సు రైలు వ్యాగన్

భువనేశ్వర్:

తూర్పు కోస్తా రైల్వే జోనల్ కార్యాలయం భువనేశ్వర్ పరిసర ప్రాంతాల్లో తరచూ గూడ్సు రైళ్లు పట్టాలు తప్పుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సుమారు వారం రోజుల వ్యత్యాసంలో మరోసారి ఆదివారం అర్ధరాత్రి 1.35 గంటలకు మంచేశ్వర్ స్టేషన్ యార్డ్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనతో అపార ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దుర్ఘటనకు గురైంది గూడ్సు రైలు కావడంతో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. పట్టాలపై నడవాల్సిన రైలు జారడంతో ఇరువైపుల పట్టాలను ప్రభావితం చేసింది. దీంతో ఈ ప్రాంతం గుండా అప్, డౌన్ దిశలో పరుగులు తీయాల్సిన రైళ్ల రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సంఘటన స్థలానికి యంత్రాంగం

ఘటనకు సంబంధించిన సమాచారం తెలియడంతో హుటాహుటిన అనుబంధ యంత్రాంగం రాత్రికి రాత్రి రంగంలోకి దిగింది. రాత్రంతా శ్రమించి తెల్లారే సరికి రైళ్ల రవాణా పునరుద్ధరణ కోసం భారీ కసరత్తు చేసింది. దుర్ఘటన తీవ్రతతో రైళ్ల రాకపోకలకు అంతరాయం అనివార్యం అయింది. తూర్పు కోస్తా రైల్వే సీనియర్ అధికారులు ప్రత్యక్షంగా ఘటనా స్థలాన్ని సందర్శించి పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. సోమవారం ఉదయం 5.05 గంటలు సమయానికి డౌన్ లైన్‌లో రైళ్ల రవాణాకు మార్గం సుగమం అయింది. అప్ లైన్ పునరుద్ధరణకు మరింత సమయం పట్టడంతో రైలు సేవలు ప్రభావితం అయ్యాయి.

రద్దయిన రైలు సేవలు

ఈ ప్రమాదంతో సోమవారం ఈ మార్గం గుండా నడవాల్సిన 6 ప్రయాణికుల రైలు సేవలు పూర్తిగా రద్దు చేశారు. మరో 6 రైళ్లు బయల్దేరే వేళలను సవరించి ఆలస్యంగా నడిపించారు. 08431 నంబర్ గల పారాదీప్ - కటక్ మెమూ, కటక్ - పారాదీప్ (08446 / 08445), కటక్ - పారాదీప్ మధ్య రాకపోకలు చేసే 08407 /08408 మెమూ, పూరీ - తాల్చేరు మెమూ రైలు సేవలను రాను, పోను రద్దు చేశారు. 08534 పలాస - కటక్ పాసింజర్, 08432 పూరీ - కటక్ పాసింజరు రైలు సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. రౌర్కెలా - పూరీ మధ్య నడిచే 18125 అప్ మరియు 18126 డౌన్ ఎక్స్‌ప్రెస్ రైలును అంగుల్ వరకు పరిమితం చేశారు. దీంతో ఈ రైలు సేవలు పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గుణుపురం - కటక్ మధ్య రాకపోకలు చేసే 08421 / 08422 ప్రత్యేక రైలు సేవలను భువనేశ్వర్ వరకు పరిమితం చేశారు. దీంతో భువనేశ్వర్, కటక్ మధ్య ఈ రైలు సేవలు పాక్షికంగా రద్దయ్యాయి. జలేశ్వర్ - పూరీ మధ్య నడిచే 08415 / 08416 మెమూ రైలు సేవలను కటక్ రైల్వేస్టేషన్ వరకు పరిమితం చేసి, పూరీ - కటక్ మధ్య పాక్షికంగా సేవలను రద్దు చేశారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యలపై సమీక్ష



విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని మల్కన్‌గిరి, కలిమెల, పోడియ, మత్తిలి, కోరుకొండ, చిత్రకొండ, ఖోయిర్‌పుట్ సమితుల్లో 1000కు పైగా గ్రామాలు ఉన్నాయి. అయితే విద్యుత్ బిల్లులు అధికంగా రావడంతో పాటు, విద్యుత్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మజ్జిగౌరి చిత్రపటం వద్ద మొక్కలను ఉంచి పూజిస్తున్న సంఘం సభ్యులు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్ అన్నారు. స్థానిక న్యూకాలనీలోని సంఘం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను సోమవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళింగ వైశ్య సంఘం ఆవిర్భవించినప్పటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా ఈసారి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇకపై ప్రతీ ఏడాది ఈ తరహా కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తామని, తమ వంతు సహకారంగా పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి సన్యాసిరాజు, చిన్నారి విజయ్ మోహన్, టంగుడు శ్రీనివాస్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో యువకుడు అరెస్టు



పోలీసులకు పట్టుబడిన యువకుడు (పసుపు రంగు టీషర్ట్)

రాయగడ: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఒక యువకుడుని సదరు పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జిల్లాలోని పద్మపూర్‌కు చెందిన చందన్ హుయికగా గుర్తించారు. అతని నుంచి 13.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు సోమవారం తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే సదరు పోలీసులు ఆదివారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతని బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. నిందితుడు గంజాయిని పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు తరలించేందుకు వచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

విద్యార్థులకు శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సోమనాథ్

మల్కన్‌గిరి: జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభించారు. మల్కన్‌గిరి సమితి ఎంవీ 7 గ్రామంలో ఉన్న జగన్నాథ్‌పల్లి హైస్కూల్‌లో మూడు రోజుల శిక్షణ ఇస్తారు. దీనిలో భాగంగా మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్, రాయగడ, కొరాపుట్‌కు చెందిన మొత్తం 70 మంది రెడ్‌క్రాస్ సభ్యులు రహదారి భద్రత, విపత్తు నిర్వహణ, రక్తదానం , ఎయిడ్స్ నియంత్రణ, వాతావరణంలో మార్పులు, చెట్ల పెంపకం, పొగాకు విరమణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మొదటి రోజు రవాణా అధికారి శ్రీజ్యోతి ప్రకాష్ కూల్ రోడ్ సురక్షతపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ అధికారి లక్ష్మణ్ స్వేమెన్, జిల్లా విద్యాశాఖ అధికారి విశ్వనాథ్ సాహు, ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

కమలా పూజారి సేవలు మరువలేనివి



కమలా పూజారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- మంత్రి నిత్యానంద గోండ్

జయపురం: పద్మశ్రీ కమలా పూజారి సేవలు మరువలేనివని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ అన్నారు. జయపురం సమితి పాత్రోపుట్‌లోని ఆమె స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ఆమె పేరు చిరస్మరణీయంగా ఉండేందుకు ఒక సంస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జయపురం బీడీవో శక్తి మహాపాత్రో తాత్కాలిక సాయంగా రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ.30 వేలు ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూప భొత్ర, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సునీల్ తండి, జిల్లా సామాజిక సురక్షా అధికారి కె.ఎస్.నిశా, పంచాయతీ కార్య నిర్వాహక అధికారి కృష్ణచంద్ర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

నదిలో పడి వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: నదిలో పడి ఒక వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన కుంద్ర సమితి మొసిగాం పంచాయతీ జనతాపుట్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు బొయిద్ పూజారి(45) ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలోని బిరి నది ప్రాంతంలో ఉన్నటువంటి తన పంట పొలానికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత అతడు నది సమీపంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. ఈ సమయంలో నది ఒడ్డున అతడి కాలు జారడంతో నదిలో పడిపోయాడు. ఆ ప్రాంతంలో ఉన్నవారు చూసి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో వారి వచ్చి గాలించినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో సోమవారం ఉదయం కుంద్ర అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక విభాగ సిబ్బంది వచ్చి విస్తృతంగా గాలించగా సంఘటన స్థలానికి 3 కిలోమీటర్ల దూరంలోని బొరగాం గ్రామ సమీప వంతెన వద్ద బొయిద్ మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బొయిపరిగడ పోలీసులు కేసు నమోదు చేశారు.

13 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

రాయగడ: సదరు సమితి కర్లకొన గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక పేకాట శిబిరంపై చందిలి పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.1,60,700ల నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో కొత్తపేటకు చెందిన రంజిత్ మాఝి, రాయగడకు చెందిన దుర్యోధన కొసల, శ్రీరాం నగర్‌కు చెందిన అనిల్ నాయక్, తెరువలి గ్రామానికి చెందిన సంతోష్ పాత్రో, కోమట్లపేటకు చెందిన ఆర్.కిరణ్, తెరువలికి చెందిన సురేష్ సరక, స్థానిక అంజిపేటకు చెందిన నాగేశ్వర్ రాయ్, కల్యాణ సింగుపూర్‌కు చెందిన సంబారు కొండగిరి, జగన్నాథ మందిరం వీధికి చెందిన వన్నా రవి, కొత్తపేటకు చెందిన రాజాన కిషోర్, తవుడు నాయుడు, జేకేపూర్‌కు చెందిన ఎస్.శివలు ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

నాటుసారాతో ఇద్దరు అరెస్టు



నాటుసారాతో పట్టుబడిన నిందితులు

జయపురం: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం జయపురం ఎక్సైజ్ సిబ్బంది జయపురం సమితి బదిలీగుడ గ్రామంలో దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా ఆ గ్రామంలోని మహిళ దామిన గదబ వద్ద 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆమెను అరెస్టు చేశారు. అలాగే జయపురం సమితి మహలియపుట్ గ్రామంలో దాడి జరిపి ఆ గ్రామంలో ధనుర్జయ రాణ అనే వ్యక్తి వద్ద 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్టు చేశారు. దాడుల్లో ఏఎస్ఐ లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



అధికారులకు సమస్యలు వివరిస్తున్న రైతులు

జయపురం: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ సమితిలోని గిర్లి, గుమడ గ్రామ పంచాయతీల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఆ విషయాన్ని ఆ ప్రాంత రైతులు జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడకు తెలియజేయగా ఆయన కోట్‌పాడ్ వెళ్లి పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. ఈ పరిస్థితికి దమయంతి సాగర్ ఎగువ వైపు మట్టి డామ్‌ను కట్టడమే కారణమని కోట్‌పాడ్ కృషక్ సమాజ్ అధ్యక్షుడు నీలకంఠ పూజారి అధికారులకు వివరించారు. దీంతో కోట్‌పాడ్ బీడీవో విక్రమ దొర, కార్య నిర్వాహక అధికారి ప్రమోద్ కుమార్ పాడీ, కోట్‌పాడ్ తహసీల్దార్ కీర్తి చంద్ర ప్రధాన్‌లు దమయంతి సాగర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

పాలసింగిలో గ్రీవెన్స్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి ఖండవ గ్రామ పంచాయతీ పాలసింగి గ్రామంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి కుమార్, ఐటీడీఏ పీవో దిలీప్ కుమార్ బెహరాల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఖండవ గ్రామ పంచాయతీ పరిధిలోని బూదర, గోరిబొంద, అల్లడ గ్రామాల నుంచి 115 వినతులు అందాయి. అందులో వ్యక్తిగత సమస్యలు 59 కాగా, గ్రామ సమస్యలకు సంబంధించినవి 56 ఉన్నాయి. కాగా మొత్తం 115 వినతుల్లో ఒక్క సమస్యను అక్కడికక్కడ పరిష్కరించారు. కార్యక్రమంలో కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, బీడీవో డంబుధర మల్లిక్, తహసీల్దార్ అశోక్ కుమార్ ప్రధాన్, కాశీనగర్ ఎన్ఏసీ ఈవో భాగవత్ సాహు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- సీఎం మోహన్ చరణ్ మాఝి
- ఢిల్లీలో ఒడిశా కేడర్ అధికారులతో చర్చలు



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్

భువనేశ్వర్: రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలపై సత్వర చర్యలు కోసం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖల్లోని ఒడిశా కేడర్ అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కోరారు. శనివారం జరిగిన నీతి అయోగ్ పాలక మండలి సమావేశానికి హాజరైన ఆయన ఒడిశా కేడర్ అధికారులు, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో నియమితులైన రాష్ట్రానికి చెందిన అధికారులతో న్యూఢిల్లీలో చర్చలు జరిపారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా కూడా హాజరయ్యారు. నీతి అయోగ్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై త్వరితగతిన చర్యలు తీసుకునేలా అధికారులు సహకరించాలని కోరారు. వికసిత్ ఒడిశా కల నెరవేరాలంటే, అయా రంగాల్లో కేంద్రం, రాష్ట్రం మధ్య సరైన సహకారం, సమన్వయం అవసరమన్నారు. 2047లో భారతదేశం వికసిత్ భారత్‌గా మారినప్పుడు, ఒడిశా నంబర్ వన్ రాష్ట్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి అపారమైన అవకాశాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్వోదయ వికాస్ యోజనలో ఒడిశాకు ప్రాధాన్యత ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒడిశాపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించడం వల్ల రాష్ట్రాభివృద్ధికి అపారమైన అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. అందరి సహకారంతో ఒడిశా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఓడ రేవుల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్, పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, రైల్వేలు, విమానాశ్రయాల విస్తరణతో సహా కొన్ని కీలక రంగాల్లో ఒడిశాకు కేంద్రం సహకారం అవసరమన్నారు. ఈ రంగాల వృద్ధికి మెరుగైన ఆర్థిక కేటాయింపులు అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే మౌలిక సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ, హైడ్రో స్టోరేజీ ప్లాంట్, సోలార్ ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్ర సహాయం కూడా అవసరమని, విస్తృత ఆర్థిక సమ్మేళనానికి బ్యాంకింగ్ నెట్‌వర్క్ వ్యాప్తి చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

రత్న భాండాగారం కమిటీ సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న భాండాగారం పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఆలయ కార్యాలయంలో జస్టిస్ విశ్వనాథ్ రథ్ అధ్యక్షతన సోమవారం కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ కమిటీ ప్రత్యక్ష పర్యవేక్షణలో రత్న భాండాగారంలో నగలు, ఆభరణాలు వగైరా అమూల్య సంపదని సురక్షితంగా శ్రీమందిరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన విషయం తెలిసిందే. రత్న భాండాగారం ఖాళీ అవ్వడంతో నిర్వహణ, మరమ్మతుల పనులు ప్రారంభించారు. ఈ బాధ్యతలు భారత పురావస్తు శాఖ ఏఎస్ఐకి అప్పగించారు. ఏఎస్ఐ కార్యకలాపాలు పురోగతి విశ్లేషణకు రత్న భాండాగారం పర్యవేక్షణ కమిటీ సభ్యులు, ఏఎస్ఐ అధికారులు సమావేశమయ్యారు.

జిల్లా జడ్జి పెద్ద మనసు



గాయాలతో పడివున్న వ్యక్తి

జయపురం: ప్రమాదానికి గురై రోడ్డు పక్కన పడివున్న బాధితుడిని ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకొని జిల్లా జడ్జి పెద్ద మనసు చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర, ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెనలు ఒక కారులో జయపురం జిల్లా కోర్టు నుంచి భరిణిపుట్ సర్క్యూట్ హౌస్‌కు సోమవారం వెళ్తున్నారు. ఆ సమయంలో భరిణిపుట్ సమీప రోడ్డు పక్కన ఒక వ్యక్తి ప్రమాదానికి గురై రక్తపు మడుగులో పడి ఉండడాన్ని చూశారు. వెంటనే కారు ఆపి కొరాపుట్ ఆస్పత్రికి ఫోన్‌చేసి అంబులెన్స్ పంపమని జిల్లా జడ్జి కోరారు. అనంతరం అంబులెన్స్‌లో ఆ వ్యక్తిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కొరాపుట్ జిల్లా ముజుంగా గ్రామానికి చెందిన బృందావన్ బాగ్‌గా అధికారులు పొల్గొన్నారు. మానవతా దృక్పథంలో స్పందించిన జిల్లా జడ్జిని పలువురు ప్రశంసిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసుకునేందుకు ఐటీఐలో పాస్ అయిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటిస్‌షిప్ దరఖాస్తు కోసం ఆగస్టు నెల 1వ తేదీ నుంచి అభ్యర్థులు వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరుతేదీ ఆగస్టు నెల 16 అని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ తదితర ట్రేడ్‌లకు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆగస్టు 27వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆ రోజు ఉదయం 10గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాల, విటి అగ్రహారం, విజయనగరంలో హాజరు కావాలని తెలిపారు.

హ్యాక్ చేసి.. అమౌంట్ కాజేసి



తెంబూరు సూర్యారావు

శ్రీకాకుళం క్రైమ్: కాసేపు ఫోన్ అడిగితే ఇచ్చిన పాపానికి రూ.1.54 లక్షలు కాజేశారని కోటబొమ్మాళికి చెందిన ఓ నాయీ బ్రాహ్మణుడు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి ఫిర్యాదు చేశాడు. కోటబొమ్మాళికి చెందిన తెంబూరు సూర్యారావు రెండేళ్ల కిందట ఖరగ్‌పూర్ ఐఐటీకి వెళ్లి అక్కడ కులవృత్తి చేసుకుంటున్నాడు. అతని బ్యాంకు ఖాతాలన్నీ కోటబొమ్మాళికి చెందినవే. ఖరగ్‌పూర్‌లోనే ఓ వ్యక్తి అర్జెంటుగా కాల్ చేయాల్సి ఉందని ఫోన్ అడిగితే ఇచ్చానని, అతను కాల్ చేసి మళ్లీ ఫోన్ ఇచ్చేశాడని, కానీ అక్కడకు కొద్ది రోజుల్లోనే ఈ నెల 19న ఉదయం 6:30 గంటలకు తన యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 1.50 లక్షలు, అక్కడికి పావుగంటలో మరో రూ.4 వేలు మాయమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే ఖరగ్‌పూర్ నుంచి వచ్చి కోటబొమ్మాళి లోకల్ బ్రాంచిని సంప్రదించగా యూనియన్ కేవైసీ అన్‌నోన్ యాప్ ద్వారా వాట్సాప్ నంబర్ తెలుసుకుని మహారాష్ట్ర ఐడీఎఫ్‌సీ బ్యాంకు చిరునామాతో ఉన్న వ్యక్తి హ్యాకింగ్‌కు పాల్పడినట్లు చెప్పారన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ యువకుడిని వెంటనే సైబర్‌సెల్‌కు పంపించి కోటబొమ్మాళి పోలీసులతో మాట్లాడారు. యువకునికి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

శాసన సభలో రసాభాస..!

- ముఖ్యమంత్రి ప్రకటనపై ప్రతిపక్షాల అభ్యంతరం
- స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లిన కాంగ్రెస్ సభ్యులు
- పలుమార్లు సభ వాయిదా



స్పీకర్ పోడియం చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో సోమవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి వ్యతిరేకంగా విపక్షాలు ప్రతిపాదించిన ప్రివిలేజ్ నోటీసు శీర్షికతో సభలో అధికార, విపక్షాల మధ్య రభస తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) నవీన్ పట్నాయక్ మాట్లాడిన తర్వాత, మధ్యాహ్నం సమయంలో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో గందరగోళం నెలకొంది. ఆ పార్టీ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి స్పీకర్ పోడియం ఎక్కేందుకు విఫలయత్నం చేశారు. కాంగ్రెస్ శాసన సభ్యుల తోపులాటల మధ్య గందరగోళం నెలకొనడంతో సభా కార్యకలాపాలు నిర్వహించలేక సభను అరగంట పాటు వాయిదా వేశారు.

ప్రివిలేజ్ కమిటీకి పంపాలని పట్టు

అనంతరం ప్రివిలేజ్ నోటీసును కమిటీకి పంపాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. పరిస్థితి మరింత ఉద్రిక్తమై తారా ప్రసాద్ బాహినీపతి స్పీకర్ పోడియం వద్ద ఒక పుస్తకాన్ని రువ్వేసి అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పోకడపై ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ కూడ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి సభ వెలుపల అగ్నివీరులకు రిజర్వేషన్లు ప్రకటించడాన్ని తీవ్రంగా నిరసించారు. యూనిఫాం సేవల్లో అగ్నివీరులకు 10 శాతం రిజర్వేషన్లు, 5 ఏళ్ల వయో పరిమితిలో సడలింపు ఉంటుందని ముఖ్యమంత్రి ఈనెల 26న ఢిల్లీకి వెళ్లే ముందు ప్రకటించారు. సభ జరుగుతుండగా అసెంబ్లీ వెలుపల ప్రకటన చేసినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే ముఖ్యమంత్రిపై ప్రత్యేకాధికారాల ఉల్లంఘన నోటీసును సమర్పించారు.

రిజర్వేషన్ల ప్రకటనపై అసహనం

శూన్య గంట సమావేశం ప్రారంభమైన వెంటనే అగ్నివీరులకు సంబంధించి రిజర్వేషన్లపై ప్రభుత్వం సభలో ప్రకటన చేయడానికి శాసనసభ వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ్‌కు స్పీకర్ సురమా పాఢి అనుమతించారు. అయితే ప్రివిలేజ్ కమిటీకి నోటీసు పంపకుండా శాసన సభ వ్యవహారాల మంత్రి ప్రకటన చేయడానికి అనుమతించడంపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత తారా ప్రసాద్ బాహినీపతి మాట్లాడుతూ.. శాసన సభలో సమావేశాలు జరుగుతుండగా ముఖ్యమంత్రి సభ నుంచి బయటకు వెళ్లడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీనికి తోడు ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇద్దరు మంత్రులపై ప్రివిలేజ్ ఉల్లంఘన నోటీసులు తెచ్చారని, ఇప్పుడు మరి అతనే ఎలా నిబంధనలు ఉల్లంఘిస్తారని మండిపడ్డారు. విపక్ష బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ ఈ విషయంలో మరింత ఘాటుగా స్పందించారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకొని అగ్నివీర్స్ గురించి ప్రకటన చేసే ముందు ముఖ్యమంత్రి హోం, ఆర్థిక, ఏజీ శాఖలతో చర్చించారా అని ప్రశ్నించారు. శాసన సభ నియమాలను ఉల్లంఘించినందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్

మరోవైపు భట్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ఇరాసిస్ ఆచార్య కాంగ్రెస్ అభ్యంతరంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రత్యేకాధికారాల ఉల్లంఘన నోటీసును తీసుకురావడానికి ముందు కాంగ్రెస్ స్పీకర్‌తో సంప్రదించిందా అని ప్రశ్నించారు. అసెంబ్లీలోకి రాకముందు ప్రతిపక్షం సభలో ప్రత్యేక హక్కును ఉల్లంఘించబోతోందని వివిధ మీడియా సంస్థలు ప్రసారం చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని ఆధారంగా స్పీకర్ అనుమతి లేకుండా, సభ వ్యవహారాలను బయట వెల్లడించినందుకు కాంగ్రెస్‌పై ప్రత్యేక హక్కుల ఉల్లంఘన నోటీసును మేము ప్రతిపాదిస్తామన్నారు. ఇలా అధికార, విపక్షాల మధ్య ఘర్షణతో సభా కార్యక్రమాలు సాయంత్రం 4 గంటల వరకు పలుమార్లు వాయిదా పడ్డాయి.

గేమ్ ఛేంజర్ కాదు నేమ్ ఛేంజర్

- ప్రభుత్వానికి ప్రతిపక్ష నేత నవీన్ చురకలు
- బడ్జెట్‌పై సుదీర్ఘ ప్రసంగం
- హామీలన్నీ అమలు చేయాలని హితబోధ



భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో తన అనుభవాన్ని విపక్ష నేత నవీన్ పట్నాయక్ ప్రదర్శించారు. బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని బడ్జెటుపై అసెంబ్లీలో ఆయన సోమవారం సుదీర్ఘంగా ప్రసంగించారు. ఎన్నికల్లో గెలిపొందేందుకు ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని సూచించారు. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ తొలి ప్రభుత్వం గేమ్ ఛేంజర్‌గా మారుతుందనే ఊహాగానాలు బడ్జెట్‌తో తలకిందులయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో ఉన్నటువంటి 45 పథకాల పేర్లను మార్చి దురదృష్టావశాత్తు నేమ్ ఛేంజర్‌గా మిగిలిందని ఎద్దేవా చేశారు.

మహిళలకు మొక్కుబడి ఊరట

సుభద్ర పథకం కింద రాష్ట్రంలోని మహిళలను అందలం ఎక్కిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 2 కోట్ల మందికి పైగా మహిళలు ఉన్నారని తెలియజేశారు. ఈ లెక్క ప్రకారం సుభద్ర ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చడానికి రూ.1 లక్ష కోట్లు కావాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం మొక్కుబడిగా రూ.10 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. ఇది ఒడిశాలోని 10 శాతం కంటే తక్కువ మహిళలకు మాత్రమే సరిపోతుందన్నారు. మిగిలిన కోటి ఎనభై లక్షల మంది మహిళల సంగతేంటని ప్రశ్నించారు. అలాగే 2027 నాటికి 25 లక్షల లఖ్‌పతి దీదీలను (లక్షాధికారి సోదరిమణులు) ఆవిష్కరిస్తుందని బీజేపీ వాగ్దానం చేసింది. దీన్ని అమలు చేయాలంటే దాదాపు రూ.20 వేల కోట్లు నిధుల కేటాయింపు జరగాల్సి ఉంది. కొత్త బడ్జెటులో నామమాత్రంగా రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.

పింఛన్‌పై మొండిచేయి

ప్రతినెలా పింఛన్‌ను రూ.3,500 లకు పెంచుతామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. కాగా రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని పేర్కొన్నారు. కానీ కొత్త బడ్జెట్ కేటాయింపుల ప్రకారం కేవలం లక్ష మంది పింఛనుదారులకు మాత్రమే లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు. మరి మిగిలిన 49 లక్షల మంది పింఛనుదారులు మాటేమిటని నవీన్ పట్నాయక్ నిలదీశారు. ఈ హామీని నెరవేర్చడానికి ప్రభుత్వానికి సంవత్సరానికి దాదాపు రూ.20 వేల కోట్లు అవసరం ఉంటాయని సూచించారు. అలాగే రైతులకు క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున కనీస మద్దతు ధర ఇస్తామన్నారని, కానీ దీనికోసం చేసిన కేటాయింపులు ముప్పై శాతం రైతులకు కూడా సరిపోదన్నారు.

ఉచిత విద్యుత్ సాధ్యమేనా

బీజేపీ ప్రచార ప్రసంగాల్లో 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తానికి కోటి ఇళ్లకు ఉచిత విద్యుత్తు ప్రణాళిక చేసింది. దీనిలో ఒడిశా వాటా 3 లక్షల ఇళ్లు కావచ్చు. రాష్ట్రంలో కోటిన్నర ఇళ్లు ఉన్నాయి. ఈ లెక్కన ప్రజలకు వాగ్దానం చేసిన ఉచిత విద్యుత్ సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఈ లెక్క ప్రకారం వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర జనాభాలో 5 శాతం మందికి కూడా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేయలేరని సవాల్ విసిరారు. బడ్జెట్ ప్రతిపాదనల్లో జూన్ 2027 నాటికి రౌర్కెలా – సంబల్‌పూర్ – పారాదీప్ మరియు ధామ్రాను కలుపుతూ పారిశ్రామిక కారిడార్ కోసం రూ.20 కోట్లు కేటాయించారు. ఇలాంటి కారిడార్‌కు రూ.1 లక్ష కోట్ల కంటే తక్కువ ఖర్చు ఉండదన్నారు. ఇటువంటి మొక్కుబడి కేటాయింపులతో 2036 నాటికి అభివృద్ధి చెందిన ఒడిశా ఆవిష్కరణతో ప్రజలను మభ్యపెట్టడం కంటే వేరే క్రూరచర్య ఇంకొకటి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎంను చంపేస్తానని బెదిరింపు

- నిందితుడు అరెస్ట్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని చంపేస్తానని సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడిన నిందితుడిని కెంజొహర్ థాణా పోలీసులు అరెస్టు చేశారు. జాజ్‌పూర్‌కు చెందిన యువకుడిని కెంజొహర్ జిల్లా పోలీసు సైబర్ విభాగం క్షుణ్ణంగా దర్యాప్తు చేసిన తర్వాత అరెస్టు చేసినట్లు కెంజొహర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) కుసల్కర్ నితిన్ దాగుడు సోమవారం తెలిపారు. ఇదో సున్నితమైన అంశమని, అందువలన ఇతర వివరాలు ప్రస్తుతానికి వెల్లడించలేమని స్పష్టం చేశారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన అలజంగి రాము

బూర్జ: మోటారు బైక్ అదుపు తప్పి పాలకొండ మండలం బుక్కూరు గ్రామానికి చెందిన అలజంగి రాము అనే వ్యక్తి సోమవారం గాయపడ్డాడు. ఆయన పాలకొండ వైపు నుంచి ఆమదాలవలస వైపు ప్రధాన రహదారిపై మధ్యాహ్నం వస్తుండగా బూర్జ మండలం డొంకలపర్త గ్రామం దగ్గరలో ప్రధాన రహదారిలో గోతులు తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో కుడికాలు విరిగిపోయింది. వెంటనే అతడిని స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కేంద్రానిది రైతు వ్యతిరేక బడ్జెట్



అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు అన్యాయం చేశారని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ కూడలి వద్ద కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడానికి సిద్ధమవ్వగా పోలీసులు అడ్డుకోవడంలో పోలీసులకు, ప్రజా సంఘాలు నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోదీ ప్రభుత్వం మరోమారు అన్యాయం చేసిందని, పేద,మధ్య తరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. 2022–23లో కన్నా ఈ బడ్జెట్లో ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం, ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోత పెట్టిందన్నారు. బీహార్‌కు గ్రాంటు రూపంలో భారీగా నిధులిచ్చిన కేంద్రం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు సమకూర్చుతామని చెప్పడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈసారి కూడా కేటాయింపుల్లో తీరని ద్రోహం జరిగిందన్నారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చటానికి నిర్దిష్టమైన కేటాయింపులు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రమణ, పి.ప్రసాదరావు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు డి.చందు, సంతోష్ కుమార్, కె.సూరయ్య, ఎం.గోవర్ధన్, ఎస్.కృష్ణవేణి, ఎస్.జగన్, డి.అప్పారావు, చిన్నప్పమ్మ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



క్వారీ నిర్వహిస్తున్న భూములు పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్, మైన్స్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 15–2, 3, 4 లో అక్రమంగా క్వారీయింగ్ నిర్వహిస్తూ అధికార పార్టీ మద్దతుదార్లు గ్రావెల్ తరలిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఈ తంతు జరుగుతోంది. ఈ విషయంపై ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా అధికారులకు సోమవారం సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ చిరంజీవి, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావుతో కూడిన అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎనిమిది టిప్పర్లు, జేసీబీ స్వాధీనం చేసుకుని ఎచ్చెర్ల పోలీస్ స్టేషకు తరలించారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ డ్రైవర్లు, స్థానికంగా ఉన్న వారిని అధికారులు ప్రశ్నించారు. తమ వద్ద ఉన్న అనుమతులు అందజేయాలని సూచించారు. ఇవి అంధవరపు అప్పారావు కుటుంబ సభ్యులకు చెందిన జిరాయితీ భూములని, వారి అనుమతితో గ్రావెల్ తరలిస్తున్నట్లు చెప్పారు. జిరాయితీలో సైతం క్వారీయింగ్‌కు అనుమతులు ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎంపీపీ చిరంజీవి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు డొంక అప్పలరాజు, మొదలవలస కృష్ణారావు, సత్తారు గోపీతో కూడిన బృందం సంఘటన స్థలానికి చేరుకొని అధికారులకు అక్రమ తరలింపు జరుగుతున్న తీరును వివరించారు. మండల పరిషత్ వరకు ఉన్న సిమ్మెంట్ రోడ్డు సైతం పాడవుతోందని తెలిపారు. టీడీపీ నాయకుడు ఈ అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, అక్రమ క్వారీయింగ్ పై సమగ్ర విచారణ చేయాలని అధికారులను కోరారు.

దాతలే దయ చూపాలి

- రెండు కిడ్నీలూ పాడైపోయి ఇబ్బంది పడుతున్న యువకుడు
- కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చిన తల్లి
- ఆపరేషన్‌కు రూ.లక్షల్లో ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

హిరమండలం: మూడు పదుల వయసులోనే ఆయనకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు తల్లి తన కిడ్నీ ఇవ్వడానికి సైతం ముందుకువచ్చారు. కానీ ఆ ఆపరేషన్‌కు రూ.లక్షల్లో డబ్బులు ఖర్చవుతాయి. సొంత ఊరిలో బతకలేక వలస వెళ్లిన ఈ కుటుంబానికి ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. దీంతో దాతల సాయం కోరుతున్నారు.

హిరమండలం మండలం పిండ్రువాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకర్ (34) చిన్ననాటి నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. ఈయన తండ్రి అనారోగ్యంతో చనిపోగా.. తల్లి, తమ్ముడుతో నివాసముండేవాడు. ఎనిమిదేళ్ల కిందట సాయిపద్మతో వివాహం జరిగింది. వీరికి మాన్విత, నందు అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో ఆకివీడు వెళ్లిపోయారు. అక్కడ శంకర్ పెయింటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే రెండేళ్ల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యులు పరీక్షించి కిడ్నీలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. రెండు కిడ్నీలకు ఇన్‌ఫెక్షన్ సోకినట్టు నిర్ధారించారు. దీంతో విజయవాడలోని సెంటినీ హస్పిటల్‌లో డయాలసిస్ జరుగుతోంది. కిడ్నీ మార్పిడి చేస్తే కానీ శంకర్ బతకడని వైద్యులు నిర్ధారించారు. తల్లి కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధపడినా.. ఆపరేషన్‌కు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. ఇప్పటికే ఉన్న కొద్దిపాటి భూమిని విక్రయించి వైద్యం చేయించారు. అందిన దగ్గర అప్పులు కూడా చేశారు. ఇక తమ వద్ద ఏమీ లేదని.. రోజు వారీ జీవనానికి కూడా కష్టమవుతుందని భార్య సాయి పద్మ కన్నీటిపర్యంతమవుతూ చెబుతున్నారు.

దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఆ కుటుంబం కోరుతోంది. సాయం చేయదలచుకున్న వారు 9491100118 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శైవ పీఠాలు కావడిధారులతో కిటకిటలాడాయి. మహా శివుడిని పవిత్ర నదీ జలాలతో అభిషేకించేందుకు వేకువజాము నుంచి శివాలయాల ప్రాంగణాల్లో బారులుతీరారు. భువనేశ్వర్ లింగరాజ్ దేవాలయం, పూరీలోని లోక్‌నాథ్ దేవాలయం, ఢెంకనాల్ కపిలాస్ ఆలయం, కటక్‌లోని ధవళేశ్వర్ ఆలయం, భద్రక్ అరోడి అఖండలమణి, నయాగడ్ లదూబాబా, గుప్తేశ్వర్‌లో శివక్షేత్రం తదితర ఆలయాల వద్దకు పెద్ద ఎత్తున భోల్ భం భక్తులు చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పాదయాత్రతో తీసుకొచ్చిన నదీ జలాలతో అభిషేకించి తరించారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: లింగరాజ దేవస్థానంలో జలాభిషేకం కోసం నిరీక్షణలో బోల్ భం దీక్షకులు



భువనేశ్వర్: స్వర్ణాద్రి (లింగరాజు దేవస్థానం) పుష్ప సోయగం



జయపురం: శబరి నదిలో స్నానాలు చేస్తున్న భోల్‌భం భక్తులు



జయపురం: గుప్తేశ్వర్‌లో పూజలందుకుంటున్న గుప్తేశ్వరుడు



పర్లాకిమిడి: పంచలింగేశ్వర ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



జయపురం: గుప్తేశ్వర మార్గంలో కావడిధారులు

క్లుప్తంగా

క్రీడా సంఘాల వివరాలు అందజేయాలి

విజయనగరం: జిల్లాలో అధికారికంగా గుర్తింపు పొందిన క్రీడా సంఘాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయానికి అందజేయాలని డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 80741 16276 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: జిల్లాలోని మైనారిటీ అభ్యర్థులకు టెట్, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (ఆర్‌సీఈడీఎం) వెల్ఫేర్‌శాఖ ప్రాజెక్టు అసోసియేట్ ఎస్.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, బుద్ధిస్ట్, పార్సీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో పేరున్న శిక్షణ సంస్థలో ఉచిత శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పాస్‌ఫొటో, టెట్‌కు అప్లై చేసిన ఎక్‌నాల్డ్జ్‌మెంట్ కాపీ, ఆధార్ జెరాక్స్‌లను తీసుకుని విశాఖలోని సిరిపురంలో ఉన్న కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్:90523 42344 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వచ్చేనెల 1న జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం వచ్చేనెల 1వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. అమర్‌రాజా బ్యాటరీస్‌లో మిషన్ ఆపరేటర్స్-250, అప్రెంటీస్ ట్రైనీ-250, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంకులో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్-60 ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు చిత్తూరు, శ్రీకాకుళం, విజయగరం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా ఎంప్లాయిమెంట్.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని ఆ రోజు ఉదయం 10 గంటలకు స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకి నేరుగా హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్:89191 79415 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

12 కిలోల గంజాయి పట్టివేత

భామిని: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు 12 కిలోల గంజాయిని భామిని మండలంలోని బత్తిలిలో పోలీసులు పట్టుకుని, ఇద్దరు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు బత్తిలి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీలో ఒడిశా నుండి ప్రైవేట్ బస్సులో తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. పాలకొండ సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రసాద్‌లు గంజాయి అక్రమ రవాణాపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

కొత్తవలస: మండల కేంద్రానికి చెందిన గుదే శంకరరావు (60) రెండు రోజుల నుంచి కనిపించకపోవడంతో ఆయన కుమారుడు గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై రహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపంలో అరటి పళ్ల దుకాణం పెట్టుకుని శంకరరావు జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 26వ తేదీన ఇంటినుంచి దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదని నాటి నుంచి తెలిసిన వారు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయిందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు.

భార్య అనారోగ్యం: భర్త ఆత్మహత్య

గుర్ల: భార్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటుండడంతో మనస్తాపం చెందిన భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్ల మండలంలోని కెల్ల గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంపోలు లక్ష్మి వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె అనారోగ్యంతో బాధ పడుతుండడంతో మనస్తాపం చెందిన భర్త అప్పలనాయుడు (31) సోమవారం గడ్డి మందు తాగేశాడు. గమనించి కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే అప్పలనాయుడు మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

పార్వతీపురం: కార్యాలయాలు, విద్యాలయాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు చేపట్టనున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం లైంగిక వేధింపులకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. లైంగిక వేధింపులపై మహిళలకు మరింత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే బాధితులు తక్షణం ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమలత, ఐసీడీఎస్ పీడీ ఎంఎం రాణితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతన వెతలు



విజయనగరం మండలంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

- ఉపాధిహామీ వేతనదారులకు అందని వేతనాలు
- రెండునెలలుగా ఎదురుచూపు
- బ్యాంకు ఖాతాలకు చేరని కష్టార్జితం
- 22వేల పనిదినాలకు నిలిచిన చెల్లింపులు
- చెల్లించాల్సిన నిధులు రూ.55లక్షలు

విజయనగరం ఫోర్ట్: ఎండనక, వాననక ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారు. నాలుగు డబ్బులు వస్తే అవసరాలు తీరుతాయని ఆశించారు. రెండు నెలలుగా వేతనాలు అందక పోవడంతో వేతనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాలు చెల్లించాలని అధికారులు, ఉపాధిహామీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేక పోవడంతో ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారం డబ్బులు రెండు మూడు రోజులకే ఖాతాలకు డబ్బులు జమయ్యేవని, ఇప్పుడు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

నిలిచిన చెల్లింపులు

జిల్లాలో 3.45 లక్షల జాబ్‌కార్డులు, 6.05 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో ఈ ఏడాది 3 లక్షల జాబ్‌కార్డుల్లో పేర్లు నమోదైన 4.46 లక్షల మంది ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నారు. మే 21వ తేదీ నుంచి వేతనదారులకు వేతనాలు జమకావడం లేదు. జిల్లాలో మొత్తం 22 వేల పనిదినాలకు రూ.55 లక్షల మేర వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారా అని వేతనదారులు ఎదురుచూస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనేవారంతా చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలే. ప్రస్తుత ఖరీఫ్ సమయంలో పెట్టుబడికి డబ్బులు లేక సతమతమవుతున్నారు. ఇప్పటికే అందాల్సిన పెట్టుబడి భరోసా డబ్బులను ప్రభుత్వం చెల్లించలేదు. కనీసం చేసిన పనికి వేతనం చెల్లింపులోనూ జాప్యం చేయడంపై మండిపడుతున్నారు.

రెండు నెలలుగా వేతనాలు అందలేదు



నేను గత పదేళ్లగా ఉపాధి హామీ పనికి వెళ్తున్నాను. ఈ ఏడాది కూడా వెళ్లాను. మే 21వ తేదీ తర్వాత నుంచి పనిచేసిన కాలానికి వేతనాలు బ్యాంకు ఖాతాకు జమకాలేదు. ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నిస్తే తెలియదని సమాధానం చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారంరోజులు పనిచేసిన తర్వాత 2, 3 రోజుల్లో వేతనాలు బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. ఇది పెట్టుబడి సమయం. వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం చొరవచూపాలి.

– నాగేశ్వరరావు, వేతనదారు, విజయనగరం

వేతన బకాయిలు నిజమే..

వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. జిల్లాలోని ఉపాధిహామీ వేతనదారులకు 22 వేల పనిదినాలకు సంబంధించిన వేతనాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రాగానే వేతనదారులకు చెల్లిస్తాం.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

మెనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉచిత శిక్షణ

పార్వతీపురంటౌన్:

టీఈటీ, డీఎస్సీ పోటీ పరీక్షలకు ఆసక్తి ఉన్న మైనారిటీ అభ్యర్థులకు మెనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పై పోటీ పరీక్షలకు హాజరయ్యే ముస్లిం క్రిస్టియన్, సిఖ్, బుద్ధిస్ట్, పార్సీ అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. ఈ శిక్షణ విశాఖపట్నంలో మంచి పేరున్న కార్పొరేట్ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో పూర్తి ఉచితంగా అందజేస్తామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశాఖపట్నంలో గల ఆర్‌సీఈడీఎం సిరిపురం కార్యాలయానికి ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో టెట్, డీఎస్సీ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసిన ఎక్‌నాలెడ్జ్‌మెంట్, ఆధార్ జిరాక్స్ కాపీలను తీసుకుని హాజరు కావాలని సూచించారు. లేని పక్షంలో ఫోన్ 90523 42344 నంబర్‌ను సంప్రదించి ఉచిత శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

కబేళా మూసివేతకు డిమాండ్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కొత్తపేటలో ఉన్న సోహల్ అహ్మద్ భవంతిలో నిర్వహిస్తున్న పశు కబేళాను శాశ్వతంగా మూసివేయించాలని గోసంరక్షకులు ఛాయాదేవి, పద్మనాభం, శ్యామ్‌సుందర్, నాగరాజు శర్మ తదితరులు కలెక్టర్ అంబేడ్కర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అక్రమ కబేళాను నేలమట్టం చేయాలన్నారు. సమస్యను తెలియపర్చిన వెంటనే స్పందించి కబేళాలోని గోవులను రక్షించిన కలెక్టర్‌తో పాటు ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టూటౌన్ సీఐ కోరాడ రామారావు, మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఆర్మీ ఉద్యోగి ఉగ్రవాదా?



మాజీ ఆర్మీ ఉద్యోగికి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు

విజయనగరం అర్బన్: దేశ రక్షణలో భాగంగా ఉగ్రవాదులను ఎదుర్కొన్న జవాన్‌ను ఉగ్రవాదిలా అవమానించి 50 మంది పోలీసులు ఇంటిమీదకు వెళ్లడం దారుణమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లిమర్ల మండలం దనాన్నపేటలో మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకునాయుడు ఇంటి ప్రహరీని అన్యాయంగా కూల్చివేశారని ఆ ఆదేశాలను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు శ్రీరాములునాయుడు, మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకునాయుడు తదితరులు ఉన్నారు.

గడువులోగా వినతులకు పరిష్కారం: జేసీ కార్తీక్

ఏ రోజు వచ్చిన వినతులు ఆ రోజే చూడాలని నాట్ వ్యూ ఉండకూడదని అలాగే వచ్చిన వాటిని గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై జిల్లా ప్రజలు అందజేసిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో జేసీ మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా అధికారులు పంపాలని ఆన్‌లైన్‌లో ఏ స్టేజిలో కూడా పెండింగ్ కనపడకూడదన్నారు. ఎన్నికల ముందు పలు శాఖల వద్ద పెండింగ్ ఉన్న 18 వినతులు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కార్తీక్‌తో పాటు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత పాల్గొన్నారు. సోమవారం వివిధ సమస్యలపై ప్రజల నుంచి 205 వినతులు అందాయి.

ఎస్పీకి అందిన 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజల నుంచి 35 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఏఎస్సైలకు పదోన్నతి

జిల్లాలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లుగా పనిచేస్తూ, ఇటీవల ఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురు ఎస్సైలను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అభినందించారు. పదోన్నతుల్లో భాగంగా జిల్లాలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న ఏఎస్సై ఎస్.అప్పారావు, గజపతినగరం స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న మాతామూర్తి, రామభద్రపురం స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్.చిన్నయ్యకు ఎస్సైలుగా ఉద్యోగోన్నతులు లభించాయి. వారిని తిరిగి విజయనగరం జిల్లాలో పనిచేసేందుకు గాను విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీచేయడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురిని ఎస్పీ అభినందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. త్వరలో జిల్లాలో పనిచేసేందుకు పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేస్తామని, సమర్థవంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఒడిశా ఇసుక ర్యాంపు పరిశీలన



ఇసుక ర్యాంప్ వద్ద జీపీఎస్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ, ఇతర లధికారులు

భామిని: మండలంలోని దిమ్మిడిజోల సమీపంలో వంశధార నదీ తీరంలో ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు సోమవారం పరిశీలించారు. పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ పర్యవేక్షణలో డివిజనల్ సర్వేయర్ పి.వెంకటరావు, జిల్లా మైన్స్ జియాలజిస్టు కుమారస్వామి, ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావుల బృందం ఇసుక ర్యాంప్‌ను సందర్శించి పరిశీలించింది. వంశధార నదీ తీరంలోని ఒడిశా భూభాగంలో ఇసుక తవ్వకాలు జరగడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రా భూభాగంలో ఇసుక తరలిస్తున్నారని సొలికిరి గ్రామానికి చెందిన రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇసుక ర్యాంపు చుట్టూ జీపీఎస్‌లో సర్వే చేశారు. ఒడిశా అధికారులు పెట్టిన సరిహద్దు బోర్డులు, వాటిలోని వివరాలు గుర్తించారు. జీపీఎస్‌లో నమోదు చేసిన వివరాలను సరిహద్దుల మ్యాప్‌లలో గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. అంతవరకు ఇసుక నిల్వలు తరలించకుండా యథావిధిగా ఉంచాలని నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. ఈ సర్వేలో భామిని సర్వేయర్ రాజేశ్వరరావు, ఎమ్మార్వై ఎస్.రాంబాబు సొలికిరి రైతులు ఉన్నారు.

ఆగంతుకుడి నుంచి రక్షణ కల్పించండి

బొబ్బిలిరూరల్: అసభ్య ఫొటోలు, వీడియోలు, పదజాలంతో మానసికంగా వేధిస్తున్న ఆగంతుకుడిని పట్టుకుని, తమకు రక్షణ కల్పించాలని బాధితురాలైన ఓ మహిళ పోలీసులను కోరింది. బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న దివెల సత్యవతి, తదితరులు సోమవారం ఈ మేరకు సీఐ నాగేశ్వర్రావుకు ఫిర్యాదుచేశారు. గడిచిన గురువారం (25వతేదీన) మధ్యాహ్నం తన ఫోన్‌కు 9470080473 నంబర్‌తో కాల్ వచ్చిందని, డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానని, సచివాలయం పరిధిలోని ఆశ, అంగన్వాడీల ఫోన్ నంబర్లు, సమాచారం కావాలని చెప్పినట్లు ఫిర్యాదులో బాధితురాలు ఏఎన్ఎం పేర్కొంది. గర్భిణుల ఆరోగ్య సమాచారం తెలుసుకునేందుకు వివరాలడినట్లు ఆగంతుకుడు చెప్పగా తాను అందరి నంబర్లు పంపించానని, నాటినుంచి ప్రతిరోజూ వాట్సాప్ నంబర్ 9542399747 నుంచి ఆశ, అంగన్వాడీలకు అసభ్యకరమైన వీడియోలను పంపుతూ అర్ధరాత్రి వేళ ఫోన్‌లు చేసి తమను మానసికంగా వేధిస్తున్నాడని ఏఎన్ఎం సత్యవతి, తదితరులు ఫిర్యాదు చేశారు. ఆగంతుకుడిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సీఐ నాగేశ్వర్రావు మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు తీసుకున్నామని, దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లా ప్రగతికి ప్రజల సహకారం కావాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి జిల్లా ప్రజల సహాయ సహకారాలు అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సెల్లార్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చిన దరఖాస్తుదారుల సమస్యలను ఓపికతో వినాలని, సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎస్.సేతు మాధవన్, ఆర్డీఓ కె.హేమలతతో కలిసి ప్రజల నుంచి 154 అర్జీలను స్వీకరించారు. అలాగే దివ్యాంగుల అర్జీలను జేసీ శోభిక వారివద్దకు వెళ్లి స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 92 వినతులు

సీతంపేట: స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌కు 92 వినతులు వచ్చాయి. పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు, వైటీసీల్లో వంటకుక్‌లు, కమాటీలుగా పనిచేస్తున్న 96 మంది తాత్కాలిక ఉద్యోగులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చాలని జీవో వచ్చినా ఇంతవరకు మార్చలేదని పలువురు సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈవో నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీడీపీవో రంగలక్ష్మి, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు అందినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మధవ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సహారా ఇండియా బాధితుల ఆందోళన

- ఖాతాదారులను దగాచేస్తున్న సంస్థ అంటూ మండిపాటు
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



ఆందోళన చేస్తున్న బాధితులు



తహసీల్దార్‌కు వివరిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: సహారా ఇండియా కంపెనీ కావాలనే బాధిత సభ్యులు, ఏజెంట్లను దగా చేస్తోందని ఆ కంపెనీ బాధితుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ఎదుట తమగోడు వెళ్లగక్కారు. దేశవ్యాప్తంగా ఆ సంస్థ చేస్తున్న మోసాలపై ఆందోళన చేశామని, న్యాయస్థానాలు సైతం డబ్బు చెల్లింపులకు ఆదేశించాయన్నారు. దేశంలో 13కోట్లమంది ఖాతాదారులు సుమారు రూ.3లక్షల కోట్లు ఆ సంస్థలో డిపాజిట్లు, పొదుపు చేసుకున్నారని 12ఏళ్లుగా ఆ సొమ్ము తిరిగి ఇవ్వకుండా సంస్థ కపట నాటకాలతో బాధితులను మోసం చేస్తోందని వాపోయారు. ఇప్పటికే అనేకమంది సభ్యులు మృతిచెందగా, ఉన్నవారిని ఆసంస్థ క్షోభకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ సంస్థ కార్యాలయాలన్నీ మూతపడ్డాయని, ఎక్కడికి వెళ్లి న్యాయం అడగాలో తెలియడం లేదని ప్రభుత్వం తగుచర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఎం శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.శంకర్రావు, శ్రీను, ఈప్రాంత బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పార్వతీపురంటౌన్: విద్యార్థులందరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని అంధత్వనివారణ సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా అధికారి డాక్టర్ నగేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఆస్పత్రిలో ఉన్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ కార్యాలయంలో నేత్ర వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 1వ తేదీ నుంచి అక్టోబర్ 31వరకు పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యాధికారులు, నేత్ర వైద్య సహాయకులు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. గతంలో పాఠశాలల్లో కంటి తనిఖీలు చేసిన వారికి దృష్టి దోషం ఉన్న విద్యార్థులకు మళ్లీ నేత్ర పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలు చేసి దృష్టిదోషం ఉన్న విద్యార్థులందరికీ కళ్లజోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి నేత్ర వైద్యశిబిరంలో పరీక్షలు చేసిన వారి వివరాలు పోర్టల్‌లో ఎలా పొందు పరచాలో వివరిస్తూ మెల్లకన్ను, గాయాల వల్ల వచ్చే కేటరాక్ట్ శస్త్ర చికిత్సల కోసం పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లాలో పనిచేస్తున్న నేత్ర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

80 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

సాలూరు రూరల్: మోటార్ సైకిల్‌పై సారా తరలిస్తున్న నిందితుడిని రూరల్ ఎస్సై వెంకటరమణ సోమవారం సాయంత్రం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి మండలంలోని దళాయివలస గ్రామసమీపంలో సిబ్బందితో కలిసి రూరల్ ఎస్సై విధులు నిర్వహిస్తుండగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి పరిశీలించి రెండు ప్లాస్టిక్ క్యాన్లతో సారాను గుర్తించారు. ఆ రెండు క్యాన్లలో ఉన్న 80 లీటర్ల సారాతో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా నిందితుడిని దిగువ మెండంగికి చెందిన మచ్చ జమ్మయ్యగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి సెమినార్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి సెమి నార్, వర్క్‌షాపును ఈ నెల 30, 31తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి. పగడాలమ్మ లెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గల అన్ని యాజమాన్య పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సీతానగరం మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వద్ద ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సెమినార్ జరుగుతుందని, సమయానికి హాజరు కావాలని స్పష్టం చేశారు.

సమస్యలుంటే చెప్పండి

- జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాస రావు
- మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి సంధ్యారాణితో పాటు హాజరు



సర్వసభ్య సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెంటాడ: మండలానికి కావాల్సిన రోడ్లు, పీహెచ్‌సీ భవనం మరమ్మతులు, గ్రామాల్లో కావలసిన ఇంకా ఏమైనా ఉంటే మా దృష్టిలో పెట్టండని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన మెంటాడ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరైన స్త్రీ శిశుసంక్షేమ శాఖ, గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి ఆయన మాట్లాడారు. సమస్యలేమైనా ఉంటే మంత్రి సంధ్యారాణితో చర్చించి పరిష్కరించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు, నాయకులకు సూచించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా వచ్చి పోయే భారీ లారీల వల్ల గజపతినగరం నుంచి మెంటాడకు వచ్చే రహదారి గుంతలు పడి పాడైందన్నారు. తక్షణమే ఆ గుంతలను కప్పి, మెంటాడ నుంచి ఆంధ్ర వెళ్లే రహదారిలో రెండు వైపులా తాటి చెట్లు తొలగించాలని రోడ్లు, భవనాల శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ పీహెచ్‌సీ డాక్టర్లు ఈ సీజన్‌లో అందుబాటులో ఉండాలని, తప్పనిసరిగా హాస్టల్స్‌ను సందర్శించాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోపీఆర్‌డీలను ఆదేశించారు. సర్పంచ్‌లంతా శానిటేషన్ వారోత్సవాలను గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ పొలాల మధ్యలో నుంచి విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల వ్యవసాయ పనుల కాలంలో స్తంభాలు పడిపోతున్నాయని, అలాగే చెట్టుకొమ్మలు విరిగి పడుతున్నాయని చెప్పారు. ఆయా సమయాల్లో విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్‌లైన్లు రోడ్డు పక్కన వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రోటోకాల్ పాటించాలి: మంత్రి ఆదేశాలు

అధికారులు ప్రోటోకాల్‌ను తప్పకుండా పాటించాలని వైస్ ఎంపీపీ పొట్టంగి దుర్గ కోరగా మంత్రి సంధ్యారాణి స్పందించారు. కచ్చితంగా స్థానిక సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు, నాయకులకు ఏ కార్యక్రమమైన అధికారులు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అప్పుడే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని, మరోసారి ఇలాంటివి జరగకుండా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు.

విత్తనాలు, ఎరువుల నిల్వలపై సూచన

మండలంలోని చల్లపేట, ఆగూరు, లోతుగెడ్డలలో విత్తనాలు, ఎరువులు నిల్వలకు చోటు లేక అవస్థలు పడుతున్నామని మండల వ్యవసాయధికారి తెలిపారు. విత్తనాలు అందరికీ సరిపడా ఇచ్చామని, ఎరువులు కూడా గత ఏడాది స్టాకు ఉందని అవసరమైతే ఇంకా తెప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. దీనికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు స్పందిస్తూ ఈ రెండు నెలలు తాత్కాలికంగా రేషన్ డిపోల్లో విత్తన, ఎరువుల నిల్వలు ఉంచేలా చూడండని అధికారులకు కోరారు.